PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

శనివారం 24-10-2026 | పేజీలు : 8 | వెల రు : 2/- | సంపుటి : 2 సంచిక :143 | ప్రచురణ: సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

భారత్, పోలండ్ విస్తృత రక్షణ బంధం..

- 2030 కల్లా 6 బిలియన్ డాలర్లకు వాణిజ్యం
- ఇరు దేశాల ప్రధానుల నిర్ణయం
- మోదీ తన మిత్రుడు కావడం గర్వకారణమన్న టుస్క్
- దిల్లీలో ప్రధాని మోదీతో పోలండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్
- "రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జామ్‌నగర్, కొల్హాపుర్ రాజ కుటుంబాలు.. పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమిచ్చాయి.



2లో

భారత్, పోలండ్‌ల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిశ్చయించాయి. మన దేశంలో 3 రోజుల పర్యటనకు వచ్చిన పోలండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్, ప్రధాని మోదీ మధ్య గురువారం దిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి.

అభివృద్ధి ఫలాలు మీకు.. మూల్యం మాకా

కాలుష్యంపై ఐరోపా సమాఖ్యకు భారత్ చురకలు



2లో

భూమిపై చేయాల్సిన కాలుష్యమంతా ఐరోపా, అమెరికా చేసి.. దాని మూల్యం పేద దేశాలను చెల్లించమంటున్నాయని భారత్ దెప్పిపొడిచింది. బెర్లిన్ గ్లోబల్ డైలాగ్‌లో పాల్గొన్న కేంద్ర వాణిజ్యశాఖా మంత్రి పీయూష్ గోయల్ .. కాలుష్యంపై పశ్చిమ దేశాల ద్వంద్వ వైఖరిని బహిరంగ వేదికపై ఎత్తి చూపారు. ఆ చర్చలో సంధానకర్తగా మిలియా తోపొజీ కాలుష్యంపై మాట్లాడుతూ వాతావరణ మార్పు తీవ్రమైన విషయం అంటూ ఏదో చెప్పబోయారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశం.. డిండి, అచ్చంపేటకు అదనపు నీటి కేటాయింపులు



రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులు, నిర్మాణ ప్రతిపాదనలపై కీలక చర్చలు జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డులో విద్యార్థుల చదువులు.. స్పందించిన మంత్రి



2లో


ఏపీకి వర్ష సూచన

బంగాళాఖాతంలో అల్పపీడనం..



2లో

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ .. ఎస్ఈసీ ఆదేశాలు



రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానాలకు నామినేషన్ల స్వీకరణ గడువు ఇవాళ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

ఈక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం.. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు వేసేందుకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదులు వస్తే వెంటనే వారిని కాంటాక్ట్ చేసి నామినేషన్ వేసేందుకు అవసరమైన రక్షణ కల్పించాలని రిటర్నింగ్ అధికారులను, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది.

దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయి:



దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి హడావిడి కొన్నిరోజులే.. ఆ తర్వాత కేసీఆర్ సీఎం అవుతారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్, భాజపాయేతర పార్టీలు కీలకమవుతాయి.

2లో

తెలంగాణ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం: సీఎం రేవంత్



2లో

హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలను పూర్తిగా అరికట్టవచ్చని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశం జరిగింది. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ డీజీపీలు హాజరయ్యారు.

మావోయిస్టులను ఎదుర్కొనేందుకు 1980ల్లో గ్రేహౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

" మన గ్రేహౌండ్స్ విభాగానికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. గతంలో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయి. తీవ్రవాద కార్యకలాపాలు అరికట్టేందుకు ఆక్టోపస్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ ముఠాలను పట్టుకునేందుకు అనేక ఆపరేషన్లు చేశాం.

సంపాదకీయం

ఎల్‌నినోతోనైనా కళ్లు తెరుద్దాం!



ఈ ఏడాది దేశంలో ఖరీఫ్ వర్షపాతం 13శాతం తగ్గిందని అంచనా. తెలుగు రాష్ట్రాలు, ఇంకా కొన్ని చోట్ల ఇది 18-- నుంచి 25శాతం ఉండొచ్చు. ఉత్తర కర్ణాటక వంటి వర్షాభావ, మెట్టప్రాంతాలు ఇంకా ఇబ్బందుల్ని ఎదుర్కోవచ్చు. తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో వరి ఎండిపోయే అవకాశం ఉంది. ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో వల్ల 30 లక్షల టన్నులు తగ్గుతాయని అంటున్నారు. అంటే 1 శాతమే కాబట్టి ఆహారపరంగా భయపడనక్కర్లేదు.

మన దేశంలో సాగునీటి ప్రాజెక్టుల పట్ల శ్రద్ధ వల్ల సుమారు 60 శాతం పంట భూములకు నికర నీటి వసతి అందుబాటులోకొచ్చింది. రెండు పంటలైతే 73 నుంచి 75 శాతం ఉన్నట్లు. కానీ నీరు అందుబాటు, ఎప్పుడో కరవు కాలంలో ప్రవేశపెట్టిన ఎంఎస్‌పీ పద్ధతిని ఇంకా కొనసాగించటం, ఉచిత విద్యుత్ వల్ల.. డిమాండ్ తగ్గుతున్న వరి పండించే ఆనవాయితీ నుంచి ఇంకా మనం బయటపడలేదు. తెలంగాణలో చిన్న నీటి, ఎత్తిపోతల పథకాల బదులు భారీ, అసంబద్ధ ప్రాజెక్టుల్ని కట్టటం తీవ్ర అభ్యంతరకరమైనా.. రుతుపవనాలపై ఆధారపడ్డ దేశంగా నీటి రిజర్వాయర్లు, బ్యారేజీలు అవసరం. ప్రస్తుతం తెలంగాణలో 62 శాతం నికర నీటి వసతి పొలాలకు ఉంది. కానీ ప్రజలు అన్నం తగ్గించి, గుడ్లు, మాంసం, చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు వంటివి ఎక్కువ ఉపయోగిస్తున్నా.. నీటి వనరులున్నాయి గదా అని వరి ఎక్కువగా పండిస్తున్నాం. డిమాండ్ లేని వరి సాగు వద్దన్న వారిని తిట్టిపోస్తున్నాం. దీనివల్ల రాష్ట్రం ఏర్పడినప్పుడు 44 లక్షల టన్నులున్న వరి ఉత్పత్తి.. గత ఏడాది 1 కోటీ 75 లక్షలకి చేరింది. 400శాతం పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో పన్నెండేళ్ల క్రితం వరి దిగుబడి 72 లక్షల టన్నులుంటే, ఇప్పుడు 81 లక్షల టన్నులకి పెరిగింది. అంటే 10 శాతం దాకా. ఏపీలో నికర నీటి వసతి ఎక్కువనుకుంటాంగానీ.. రాజస్థాన్‌తో సమానంగా 52 శాతం మాత్రమే. అయితే డిమాండ్ ఉన్న పండ్లు, కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటల దిగుబడి తెలంగాణలో తగ్గగా, ఏపీలో భారీగా పెరిగింది. ఏపీలో 1.4 కోట్ల టన్నుల నుంచి 2.8 కోట్ల టన్నులకు, యూపీలో గత పదేళ్లలో 3.3 కోట్ల టన్నుల నుంచి 5.3 కోట్ల టన్నులకు, మహారాష్ట్రలో 1.8 కోట్ల టన్నుల నుంచి 3.3 కోట్ల టన్నులకు ఉద్యాన దిగుబడి పెరిగింది. తెలంగాణలో 83 లక్షల టన్నుల నుంచి 30 లక్షలకు తగ్గింది.

వ్యవసాయంలోని మరో అంశం విద్యుత్తు. భూగర్భ జలాలు ఎండిపోవటం వల్ల తెలంగాణలోని 30 లక్షల బోర్లతో ఉచిత విద్యుత్ వినియోగం పెరగటం తప్ప నీరు రావటం లేదు. దీంతోపాటు, ఇళ్లలోనూ ఫ్యాన్లు, ఏసీల వినియోగం పెరగటంతో.. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గత సంవత్సరం అక్టోబర్‌లో 15,000 మెగావాట్లుండగా, ఈ ఏడాది 20,000 మెగావాట్లకి పెరిగింది. ఇందులో 25 నుంచి 27 శాతం రైతుల ఉచిత విద్యుత్ ఖాతాలోకి పోతోంది. మీటర్లు బిగించకపోవటం వల్ల రైతుల పేరుతో ఇతరులు దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. విద్యుత్‌కు యూనిట్ రూ.15 ఇస్తానన్నా మార్కెట్‌లో దొరకటం లేదని ముఖ్యమంత్రి వాపోతున్నారు. మనం కూడా పొరుగులాగా ఇళ్లలో విద్యుత్‌ను పొదుపుగా ఉపయోగించుకోవటం వంటి మార్గాల్లో సహకరించాలి.

సూపర్ ఎల్‌నినో ప్రభావిత ఇంకో అంశం తాగునీరు. హైదరాబాద్‌నే తీసుకుందాం. లండన్, టోక్యో వంటి మహానగరాల కంటే ఎక్కువ నీటి సరఫరా జరుగుతోంది. హైదరాబాద్‌కి రోజుకి 260 కోట్ల లీటర్లు. అంటే, తలసరి 210 లీటర్లు. మన అవసరం 135 లీటర్లు. అయినా మంచినీటికి కటకట. లండన్‌లో 135 లీటర్లు, బెర్లిన్‌లో 110, టోక్యోలో 170, డాలస్‌లో 204 లీటర్లు మాత్రమే తలసరి సరఫరా చేస్తున్నారు. ఈ నగరాలన్నిటిలోనూ 24 గంటలూ తాగునీరు అందిస్తున్నారు. హైదరాబాద్‌లో 210 లీటర్లు ఇస్తున్నా, రెండురోజులకోసారి కొద్ది గంటలు వస్తే అదృష్టమనుకునే ప్రాంతాలు చాలా ఉన్నాయి. నగరం నడిబొడ్డున ఉన్న ప్రాంతంలో కూడా మంచినీటికి కటకట. ఇందుకు కారణం, 'మనం మంచినీరు తెస్తున్నాం, పంపిణీ వ్యవస్థను నిర్లక్ష్యం చేశాం. సంపన్నులకీ ఉచితంగా మంచినీరు ఇస్తున్నాం'. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ఉచితంగా తాగునీరు ఎవరిమ్మన్నారు? మన సొంత సొమ్మయితే అలా ఖర్చు చేస్తామా? ఇది కాక 50శాతం మూసీలో కలిసిపోతోంది. మంచినీరు, మురుగునీరు కలసి ప్రవహిస్తున్నాయి. హైదరాబాద్‌కి అదనంగా 50 మిలియన్ గ్యాలన్లు మంచినీరు తెస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ అంతకంటే ముఖ్యం తాగునీటి పంపిణీ వ్యవస్థను బాగుచేసి 24 గంటలూ మంచినీరు అందించటం. పైప్‌లలో తాగునీరు నిరంతరం ప్రవహిస్తుంటే, మురుగునీరు కలిసే అవకాశాలు తక్కువ.

పొరుగున ఉన్న చెన్నైకి హైదరాబాద్‌లా గోదావరి, కృష్ణా వంటి పెద్ద నదుల ద్వారా తాగునీటి అవకాశం లేదు. కొన్నేళ్ల క్రితం రైళ్లలో తాగునీరు తెప్పించుకున్నారు. కానీ నీటి నిల్వ, పంపిణీని సమర్థంగా బాగుచేసుకోవటంతో ఇప్పుడు మండు వేసవిలోనూ మంచినీటి కొరత లేదు. హైదరాబాద్ నగరం కోసం కృష్ణా, గోదావరి నదుల నుంచి రోజూ 260 కోట్ల లీటర్ల నీటిని తోడి తెస్తున్నాం. అయినా నీటి పంపిణీ లోపం వల్ల నీళ్ళ కొరత మనల్ని ఇబ్బంది పెడుతోంది. బెంగళూరు జనాభా హైదరాబాద్ కంటే ఎక్కువ. అయినా ఆ నగరంలో 160 కోట్ల లీటర్ల సరఫరాతో మన కంటే బాగా నీటిని పంపిణీ చేస్తున్నారు. రోజూ 120 కోట్ల లీటర్ల నీటిని చెన్నైలో సరఫరా చేస్తున్నారు. అయినా సంక్షోభం, కొరత లేకుండా నీటిని సరిగ్గా పంపిణీ చెయ్యగలుగుతున్నారు. హైదరాబాద్ నీటి సమస్య ప్రధానంగా పంపిణీ వ్యవస్థ శిథిలమైపోవటం వల్ల ఉత్పన్నమయింది.

ప్రస్తుత వర్షాభావం రీత్యా రైతులు ఆందోళన చెందకుండా రెండో పంటగా అపరాలు, నూనె గింజలకి లేదా క్రాప్ హాలిడేకి నచ్చచెప్పటం, లాభాలొచ్చేలా మార్కెటింగ్ వ్యవస్థలో తగిన ఏర్పాట్లు, భరోసానిచ్చే ప్రత్యామ్నాయాలు చూపుతూ వరి పంట సాగుని తగ్గించటం, ఉద్యానవన, తృణధాన్యాలు వంటి ప్రజారోగ్యానికి మేలుచేసే, డిమాండున్న పంటలకు ప్రోత్సాహకాలు, పెట్టుబడి వ్యయానికి తగిన రుణసదుపాయాలు, ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించి బాధ్యత కోసం కొద్దిపాటి రుసుము వసూలు చేయటం వ్యవసాయంలో యుద్ధప్రాతిపదికన చేయాల్సిన పనులు. అధిక వర్షపాతాన్ని ఒడిసిపట్టేలా హేతుబద్ధ ప్రాజెక్టుల్ని పెంచాలి. చెరువులు, ఇతర సంప్రదాయ నీటి వసతుల్ని కాపాడుకోవాలి. పప్పు దినుసులు, పామాయిల్, ఇతర వంటనూనెలపై దిగుమతి సుంకం నిలకడగా కొనసాగించి, ఆ డబ్బు రైతులకే అందించి ఏపీ, తెలంగాణల్లో పెరుగుతున్న సాగును ఇంకా ప్రోత్సహించాలి. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యధికంగా మలేసియా, ఇండోనేసియా నుంచి 20 నుంచి 30 బిలియన్ డాలర్లను ఖర్చుపెట్టి వంటనూనె దిగుమతి చేసుకుంటున్నాం.

తెలంగాణకు నీటి సరఫరా చేసే కృష్ణాలో ఈ సీజన్‌లో 72 శాతం లోటు, గోదావరిలో 42శాతం లోటు ఏర్పడింది. 460 టీఎంసీల అవసరం ఉండగా, కేవలం 209 టీఎంసీలు ఉన్నాయి. తాగునీరు తొలి ప్రాధాన్యం కాబట్టి ఈ ప్రత్యేక పరిస్థితుల్లో రైతులు కూడా సహకరించాలి. యూరియా బస్తా ఖరీదు రూ.4,600 అయినా రైతులకు ప్రభుత్వం కేవలం రూ.266కి ఇస్తోంది. కాబట్టి, ప్రతిదానికీ ప్రభుత్వాన్ని విమర్శించటం తగదు. హోర్మూజ్ జలసంధి మూతపడినా, ఎల్‌నినో వచ్చినా విద్యుత్, వంటగ్యాస్ వినియోగానికి భారీ ఆర్థికభారం పడకుండా 'పునరుత్పాదక సౌర ఇంధనం, రైతులకు ఆదాయాన్నిచ్చే కంప్రెస్డ్ బయో గ్యాస్ ఇంధన పంటల సాగు' వంటి మార్గాలకు వేగంగా మళ్లాలి. సూపర్ ఎల్‌నినోపై పార్టీలకతీతంగా స్పందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తి రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనం. ప్రభుత్వాలు, పార్టీలతోపాటు పౌర సమాజం కూడా ఇందుకు పూర్తిగా కలసిరావాలి. ఇప్పుడు సమస్యను పరిష్కరించుకోవటంతోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఇక ముందు సాగు, తాగు, విద్యుత్ రంగాలలో సమస్యలు లేకుండా, రైతులకు, వినియోగదారులకు, పెట్టుబడులకు, యువత ఉపాధికి దోహదం చేసేలా శాశ్వత, పర్యావరణహిత ఏర్పాట్లకి ఈ సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుందాం.

తెలంగాణ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం: సీఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలను పూర్తిగా అరికట్టవచ్చని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశం జరిగింది. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ డీజీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

"సమాజానికి భద్రత, రక్షణ పునాదులు లాంటివి. సమర్థ, నిష్పక్షపాత పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటారు. తెలంగాణ పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. హైదరాబాద్‌ను నాలుగు కమిషనరేట్లుగా విభజించి అత్యుత్తమ సేవలందిస్తున్నాం. నార్కోటిక్స్, సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టాం. మన సైబర్ సైక్యూరిటీ బ్యూరో, ఈగల్ ఫోర్స్‌కు కేంద్ర అవార్డులు వచ్చాయి. ఆహార కల్తీ నివారణకు టీజీ సేఫ్, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రా ఏర్పాటు చేశాం. పోలీస్ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ తీసుకొచ్చాం. పోలీసు శాఖపై పెట్టే ఖర్చును పౌరుల భద్రతకు పెట్టుబడిగా భావిస్తున్నాం"అని సీఎం అన్నారు.

తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరుంది: డీజీపీ సీవీ ఆనంద్

మావోయిస్టులను ఎదుర్కొనేందుకు 1980ల్లో గ్రేహౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. " మన గ్రేహౌండ్స్ విభాగానికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. గతంలో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయి. తీవ్రవాద కార్యకలాపాలు అరికట్టేందుకు ఆక్టోపస్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ ముఠాలను పట్టుకునేందుకు అనేక ఆపరేషన్లు చేశాం. డ్రగ్స్ కట్టడికి చేసిన కృషికి కేంద్ర హోంశాఖ అవార్డు ఇచ్చింది. సైబర్ నేరాల కట్టడికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. దీనికి కూడా కేంద్రం అవార్డు ఇచ్చింది. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ మారింది. 824 మంది నక్సల్స్ లొంగిపోయారు.. 302 ఆయుధాలు అప్పగించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రకృతి విపత్తుల్లో సమర్థంగా సేవలందించాం. పోలీసులు వాడే యాప్‌లను టీస్పార్క్ పేరుతో అప్‌డేట్ చేశాం. మహిళల భద్రతకు ప్రత్యేక విభాగం పని చేస్తోంది. దీని కోసం టీసేఫ్ యాప్ రూపొందించాం" అని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు


దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రేవంత్‌రెడ్డి హడావిడి కొన్నిరోజులే.. ఆ తర్వాత కేసీఆర్ సీఎం అవుతారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్, భాజపాయేతర పార్టీలు కీలకమవుతాయి. రాహుల్‌గాంధీ ఏం చేసినా లాభం లేదు. మోదీ వల్ల ఏం జరిగిందో చూస్తున్నాం. కాంగ్రెస్ విఫలమైనందునే సీజేపీ పేరుతో యువత పోరాటం చేస్తోంది. తెలంగాణ ప్రయోజనాల కోసం ఒక్క ఎంపీ కూడా పనిచేయడం లేదు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన వర్గాలన్నీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయి. రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పెడుతున్నారు. ఎల్‌నినో ఉందని 10 నెలల ముందే నిపుణులు చెప్పారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా మమ్మల్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉన్నారు" అని కేటీఆర్ అన్నారు..

బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీకి వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి



అమరావతి: తూర్పు మధ్య- ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. శనివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా రూపాంతరం చెందనుంది. ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడి.. ఈ నెల 26 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉంది. తుపాను ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర- దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని కోరింది.

అభివృద్ధి ఫలాలు మీకు.. మూల్యం మాకా: కాలుష్యంపై ఐరోపా సమాఖ్యకు భారత్ చురకలు

మొదటిపేజీ తరువాయి

భూమిపై చేయాల్సిన కాలుష్యమంతా ఐరోపా, అమెరికా చేసి.. దాని మూల్యం పేద దేశాలను చెల్లించమంటున్నాయని భారత్ దెప్పిపొడిచింది. బెర్లిన్ గ్లోబల్ డైలాగ్‌లో పాల్గొన్న కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ .. కాలుష్యంపై పశ్చిమ దేశాల ద్వంద్వ వైఖరిని బహిరంగ వేదికపై ఎత్తి చూపారు. ఆ చర్చలో సంధానకర్తగా మిలియా తోపొజీ కాలుష్యంపై మాట్లాడుతూ వాతావరణ మార్పు తీవ్రమైన విషయం అంటూ ఏదో చెప్పబోయారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ " ప్రపంచంలో భారత్ జనాభా వాటా 17 శాతంగా ఉన్నప్పటికీ.. మా దేశం నుంచి వస్తోన్న కర్బన ఉద్గారాల శాతం 3 నుంచి 3.5 శాతం మాత్రమే. అదే ఐరోపా జనాభా 3 శాతం ఉంటే.. వారి నుంచి విడుదలైన కర్బన ఉద్గారాలు 17 శాతం వరకు ఉన్నాయి. ఈ రోజుకు భారత్ తలసరి కర్బన ఉద్గారాల శాతం ఐరోపా తలసరిలో 10% వరకు మాత్రమే ఉంటాయి.

కర్బన ఉద్గారాలకు సంబంధించిన నిబంధనలు , స్టీల్ దిగుమతులపై విధిస్తోన్న సుంకాలతో ఐరోపాలో వ్యాపారాలు ఇబ్బందిపడుతున్నాయి. వినియోగదారులకు అదనపు భారంగా మారుతున్నాయి. మీరు నిబంధనలు పెంచుకుంటూ పోతే.. మీ పరిశ్రమలపైనే భారం పడుతుంది. పోర్టులు, రహదారుల వంటి మౌలిక వసతుల నిర్మాణాలు మరింత ఖరీదైనవిగా మారతాయి. మిమ్మల్ని మీరే పోటీలో లేకుండా చేసుకుంటున్నారు. " అని గోయల్ గుర్తు చేశారు.

ప్రమాదంలో పగడపు దిబ్బలు

భారత్, పోలండ్ విస్తృత రక్షణ బంధం

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: భారత్, పోలండ్‌ల మధ్య విస్తృత రక్షణ బంధానికి బాటలు పడ్డాయి. అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లోనూ మరింతగా సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు వాణిజ్యాన్ని ఇప్పుడున్న దానికి రెట్టింపు చేస్తూ 2030 నాటికి 6 బిలియన్ డాలర్లకు చేర్చాలని నిశ్చయించాయి. మన దేశంలో 3 రోజుల పర్యటనకు వచ్చిన పోలండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్, ప్రధాని మోదీ మధ్య గురువారం దిల్లీలో ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. అనంతరం రెండు దేశాలు కలిసి నాలుగు అంశాలపై ప్రకటన చేశాయి. ఇందులో వాణిజ్యం రెట్టింపు, రక్షణ రంగ పరిశ్రమల ఏర్పాటుపై చర్చలు, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం ఉన్నాయి.

ఉక్రెయిన్-రష్యా, పశ్చిమాసియాల్లో శాంతి సాధనకు జరిగే ఎటువంటి అర్థవంతమైన ప్రయత్నాలకైనా పూర్తి మద్దతిస్తామని ప్రధాని మోదీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భారత్, పోలండ్‌లు ప్రజాస్వామ్య విలువలను నమ్ముతాయని, చట్టాలను గౌరవిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు మోదీపై టుస్క్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన తన స్నేహితుడని చెప్పుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు."పోలండ్‌తో కలిసి రక్షణ, అంతరిక్ష, అణు ఇంధన రంగాల్లో అభివృద్ధి, తయారీకి కృషి చేయాలని నిర్ణయించాం. కీలక ఖనిజాలు, బొగ్గు రంగాల్లోనూ సహకరించుకోవాలని అంగీకరించాం" అని మోదీ పేర్కొన్నారు "రెండో ప్రపంచ యుద్ధ కాలంలో జామ్‌నగర్, కొల్హాపుర్ రాజ కుటుంబాలు.. పోలండ్‌కు చెందిన వేల మంది పిల్లలు, ప్రజలకు ఆశ్రయమిచ్చాయి. 2022లో ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రారంభమైనప్పుడు అదే తరహాలో భారతీయులను తరలించేందుకు పోలండ్ సహకరించింది" అని మోదీ వివరించారు.తమ డ్రోన్లు ఎంతో ఉపయోగకరమని పోలండ్ ప్రధాని ఓ ఆసక్తికర వ్యాఖ్య చేశారు. అయితే వివరాలను వెల్లడించలేదు.టుస్క్ గౌరవార్థం విందు పోలండ్ ప్రధాని టుస్క్ గౌరవార్థం హైదరాబాద్ హౌస్‌లో గురువారం మధ్యాహ్నం ప్రధాని మోదీ విందు సమావేశం నిర్వహించారు. దీనికి 20 మంది పోలండ్ ప్రతినిధులు, 20 మంది భారత వాణిజ్య, పారిశ్రామిక, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు.

రేకుల షెడ్డులో విద్యార్థుల చదువులు.. స్పందించిన మంత్రి లోకేశ్

మొదటిపేజీ తరువాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలంలో సరైన పాఠశాల భవనం లేక రేకుల షెడ్డులో చదువుకుంటున్న చిన్నారుల దీనస్థితిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సదుపాయాలు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఓ యువకుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. పాఠశాల భవనాన్ని వెంటనే పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ .. ఎస్ఈసీ ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

అమరావతి: రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానాలకు నామినేషన్ల స్వీకరణ గడువు ఇవాళ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. ఈక్రమంలో రాష్ట్ర ఎన్నికల సంఘం.. అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నామినేషన్లు వేసేందుకు ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదులు వస్తే వెంటనే వారిని కాంటాక్ట్ చేసి నామినేషన్ వేసేందుకు అవసరమైన రక్షణ కల్పించాలని రిటర్నింగ్ అధికారులను, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీలు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఎస్పీలు, ఆర్వోలు గడువులోగా నామినేషన్లు వేయించేలా చూడాలని ఆదేశించింది.

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం చాగదు - వార్త ఆగదు
24-10-2026

ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి.. ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

రాబోయే రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉంటూ, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం పంటలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి అవసరం అధికంగా ఉండే వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి



పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. కుసుమ, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీలతో పాటు వివిధ పథకాల ద్వారా ప్రోత్సాహం అందిస్తోందని వివరించారు. ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటలను సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, పంటల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవడంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ప్రత్యామ్నాయ పంటల సాగు, పంటల సంరక్షణపై అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, చిన్నచింతకుంట సర్పంచ్ సరిత మహేష్, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక.. గ్రామ, మండల, మున్సిపల్ స్థాయిల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులు, వర్షపాతం లోటు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. విపత్కర పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, నీటి వనరుల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, నీటి పొదుపు చర్యలు, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లాలోని గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా స్థానిక పరిస్థితులను అంచనా వేసి, ఆయా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రణాళికల అమలును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఎదురయ్యే వాతావరణ పరిస్థితులు, నీటి కొరతను అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో సంబంధిత శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఎల్‌నినో ప్రభావం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా



వినియోగించేలా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించే చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. రానున్న కాలంలో తాగునీరు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టే చర్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు

జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి.. ఢిల్లీ ఉద్యమకారులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి: ములకలపల్లి రాములు

కోదాడ, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి):

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఢిల్లీలో ప్రజాస్వామ్యం, ఓటు హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తున్న నాయకులపై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని రంగ థియేటర్ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ములకలపల్లి రాములు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ తీసుకుంటున్న



నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల హక్కులకు విఘాతం కలుగుతోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి ఉండాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాత్రను తొలగించి, కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ఓటు హక్కును కాపాడుకోవడం కోసం పోరాడుతున్న నాయకులపై లాఠీచార్జీలు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని, ఉద్యమకారులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మీదు వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోటగిరి వెంకటనారాయణ, సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎం. ముత్యాలు, కౌలుదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ సైదా, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి, రైతు సంఘం నాయకులు అలసగాని బ్రహ్మయ్య, రాపోలు సూర్యనారాయణ, నాగాటి రాములు, సోంపంగు రాధాకృష్ణ, జంగాపల్లి శీను, కలయాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు రాయిని శివచందర్

మెదక్, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్--కరీంనగర్--నిజామాబాద్--ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డిని భారతీయ జనతా పార్టీ సంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా నాయకుడు రాయిని శివచందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సి. అంజిరెడ్డికి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక భేటీ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలియజేసి స్నేహపూర్వకంగా మాట్లాడుకున్నారు.



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన క్యూ.ఆర్.టీ సిబ్బంది




ఏడుపాయల, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలో దర్శనానికి వచ్చి తప్పిపోయిన నాలుగేళ్ల బాలుడిని జిల్లా పోలీసుల క్యూ.ఆర్.టీ (క్విక్ రెస్పాన్స్ టీమ్) సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. బాన్సువాడకు చెందిన మోహన్, సంధ్య దంపతులు శుక్రవారం ఏడుపాయల అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలో వారి నాలుగేళ్ల కుమారుడు మోక్షిత్ తప్పిపోయాడు. ఆలయ ప్రాంగణంలో బాలుడు ఒంటరిగా ఏడుస్తూ కనిపించడంతో అక్కడ విధుల్లో ఉన్న క్యూ.ఆర్.టీ సిబ్బంది వెంటనే స్పందించి బాలుడిని చేరదీశారు. అనంతరం బాలుడి వివరాలను సేకరించి, అతని తల్లిదండ్రులను గుర్తించి సురక్షితంగా వారి వద్దకు చేర్చారు. తమ కుమారుడు క్షేమంగా తిరిగి లభించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించి, సమయస్ఫూర్తితో బాలుడికి భద్రత కల్పించి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన క్యూ.ఆర్.టీ సిబ్బందిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా పోలీసులు రద్దీ ప్రదేశాలు, ఆలయాలు, జాతరలకు పిల్లలతో వచ్చే తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నారులను ఎల్లప్పుడూ తమ పర్యవేక్షణలో ఉంచుకోవాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల అర్హతలు పరిశీలించాలి.. ఎంఈఓకు ఏబీవీపీ వినతి

వట్‌పల్లి, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):



వట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల విద్యార్హతలను అధికారులు తక్షణమే పరిశీలించాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల విద్యాధికారి (ఎంఈఓ) రంజిత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ నిఖిల్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల విద్యార్హతలను సమగ్రంగా తనిఖీ చేయాలని కోరారు. నిబంధనలకు అనుగుణమైన అర్హతలు లేని ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే, సంబంధిత ఉపాధ్యాయులతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలల యాజమాన్యాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణను పెంచాలని, పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులే బోధించేలా తగిన చర్యలు చేపట్టాలని ఏబీవీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

అలాయ్ బలాయ్ కార్యక్రమంలో దామోదర్ రాజనర్సింహాతో మార్వెల్లి నాయకుల ఆత్మీయ భేటీ



సంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావం, సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన అలాయ్ బలాయ్ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ పటేల్‌తో పాటు సంగారెడ్డి జిల్లా మార్వెల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాయ్ బలాయ్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ వర్గాల ప్రజల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు పరస్పర ఐక్యతను బలోపేతం చేయడానికి దోహదపడతాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ పటేల్, మార్వెల్లి గ్రామ మాజీ సర్పంచ్ శివశరణ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ సాయిబాబా, మాజీ ఉపసర్పంచ్ బస్వరాజ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
24-10-2026

ఇందిరమ్మ పాడి పశువుల పంపిణీలో కాంగ్రెస్ పక్షపాతం.. టీఆర్ఎస్ నాయకుల వినతి



మధిర, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమంలో భాగంగా పేద ప్రజల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.2,100 చొప్పున నగదు వసూలు చేసి, పాడి గేదెల పంపిణీ చేసే సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపిస్తూ టీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇందిరా మహిళా డెయిరీ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ కల్పనకు వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో సుమారు 100 నుంచి 200 మంది వరకు పేద ప్రజల వద్ద ఎలాంటి పార్టీ భేదం లేకుండా నగదు వసూలు చేస్తున్నారని, అయితే పాడి గేదెల పంపిణీ సమయంలో మాత్రం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇస్తామంటూ నిబంధనలు విధిస్తున్నారని టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దీంతో ఇతర పార్టీలకు చెందిన పేద ప్రజలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి నగదు వసూలు చేసే సమయంలో రాజకీయ భేదాలు చూపకుండా, లబ్ధిదారులకు పాడి గేదెలు పంపిణీ చేసే సమయంలో రాజకీయ పక్షపాతం ప్రదర్శించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమం ద్వారా లబ్ధి పొందేందుకు నగదు చెల్లించిన అర్హులైన పేదలందరికీ పార్టీ భేదం లేకుండా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించి, అర్హత ప్రాతిపదికన పాడి గేదెలు పంపిణీ చేయాలని కోరారు. ఇదే విధంగా ఒకే పార్టీకి చెందిన వారికే ప్రాధాన్యతనిస్తూ లబ్ధిదారుల జాబితాలను రూపొందిస్తే, భవిష్యత్తులో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

నాగులవంచలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చింతకాని, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి):

ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలోని సైడ్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు బస్టాండ్, పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడటంతో పాటు ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువలు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రోడ్లపై, మురుగు కాలువల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు పాటించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారగాని రాంబాయి, ఉపసర్పంచ్ అంబటి శరత్ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పుట్టినరోజు వేడుకలు

అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి):



మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు పుట్టినరోజు వేడుకలు వరంగల్ లో ఘనంగా జరిగాయి. వరంగల్ చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, గ్రంథాలయ చైర్మన్ మీసాల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

96 ఏళ్ల మల్లవరం బామ్మ చిరకాల కోరిక నెరవేర్చేందుకు ఎంపీ వద్దిరాజు కృషి.. సామ్రాజ్యాన్ని ఆప్యాయంగా పలకరించిన కేటీఆర్

ఖమ్మం, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ శెట్టి సురేష్):

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన 96 ఏళ్ల దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కోరికను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చొరవ తీసుకున్నారు. మల్లవరం గ్రామ సర్పంచ్‌గా రెండుసార్లు, ఎంపీటీసీగా రెండుసార్లు, సింగిల్ విండో డైరెక్టర్‌గా పనిచేసిన సామ్రాజ్యం గ్రామంలో అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలను పొందారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుపై ఆమెకు అపారమైన అభిమానం ఉంది. కేసీఆర్‌ను స్వయంగా కలిసి ఆయనతో ఫొటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక. ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో



శుక్రవారం సామ్రాజ్యాన్ని ఆమె కుమారులు వెంకటలాల్, అజయ్ కుమార్, మనవళ్లు యుధిష్టర్, శ్రీరఘునందన్‌లతో కలిసి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు తీసుకెళ్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ 96 ఏళ్ల సామ్రాజ్యాన్ని ఆప్యాయంగా పలకరించి, శాలువాతో సత్కరించి గౌరవించారు. త్వరలోనే కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. చిన్న వయసులోనే సమాజసేవ.. శ్రీరఘునందన్‌కు కేటీఆర్ అభినందనలు: సామ్రాజ్యం మనవడు, అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ ప్రస్తుతం బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు. చిన్నతనం నుంచే సమాజసేవ, పరిశుభ్రత, పచ్చదనం పట్ల ఆసక్తి కనబరిచిన ఆయన, 2016 ఫిబ్రవరి 17న కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా తన స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నారు. అప్పటికి ఆయన ఐదో తరగతి చదువుతుండగా, వయస్సు కేవలం తొమ్మిదేళ్లు మాత్రమే. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పరిసరాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు కృషి చేశారు. చిన్న వయసులోనే శ్రీరఘునందన్ చేసిన సేవలను గుర్తించి 2017లో జాతీయ స్థాయిలో, 2017--18లో రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరఘునందన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అభినందించారు.

గద్వాల నడిగడ్డ రాజకీయాల్లో కురువ సరిత తిరుపతయ్య ప్రస్థానం.. బడుగు వర్గాల ఆత్మగౌరవం, ప్రజా సమస్యలే ప్రధాన అజెండా

- నరేంద్ర ఆమూరి, సామాజిక, రాజకీయ విశ్లేషకుడు

గద్వాల, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్):

తెలంగాణ రాజకీయాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పనిచేసే నాయకత్వానికి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో జోగులాంబ గద్వాల జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ కురువ సరిత తిరుపతయ్య రాజకీయ ప్రస్థానం చర్చనీయాంశంగా మారుతోంది. ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవడం నాయకత్వానికి ముఖ్యమైన లక్షణమని ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైనప్పటికీ, అనంతరం కూడా ప్రజా సమస్యలపై తన గొంతు వినిపిస్తూ రాజకీయంగా చురుకుగా కొనసాగుతున్నారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో పల్లెల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను తెలుసుకోవడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాలపై దృష్టి సారిస్తున్నారని ఆమె మద్దతుదారులు చెబుతున్నారు. గతంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన అనుభవంతో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సాగునీటి సమస్యలు, రైతుల ఇబ్బందులు, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలపై ఆమె ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గద్వాల ప్రాంతంలో రాజకీయంగా మహిళలు ఎదుర్కొనే సవాళ్ల మధ్య ప్రజా జీవితంలో కొనసాగడం, కార్యకర్తలతో సంబంధాలను కొనసాగించడం ఆమె రాజకీయ ప్రస్థానంలో కీలక అంశాలుగా నిలుస్తున్నాయి. ఆమె భర్త తిరుపతయ్యతో పాటు క్షేత్రస్థాయి కార్యకర్తల మద్దతు తన రాజకీయ కార్యకలాపాలకు తోడ్పడుతున్నట్లు ఆమె వర్గీయులు పేర్కొంటున్నారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన ఇతర వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, అభివృద్ధి అవకాశాలు అందాలనే అంశాలను ఆమె రాజకీయ ప్రస్థానంలో ప్రధానంగా ప్రస్తావిస్తున్నారని మద్దతుదారులు చెబుతున్నారు. ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలతో నిరంతర



సంబంధాలు కొనసాగించడం, స్థానిక సమస్యలపై స్పందించడం నాయకత్వానికి ప్రజల్లో గుర్తింపు తెచ్చే అంశాలని రాజకీయ విశ్లేషకుడు నరేంద్ర ఆమూరి అభిప్రాయపడ్డారు. గద్వాల రాజకీయాల్లో కురువ సరిత తిరుపతయ్య భవిష్యత్ ప్రస్థానం ఏ దిశగా సాగుతుందన్నది రాబోయే పరిణామాలపై ఆధారపడి ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై ఆమె కొనసాగిస్తున్న కార్యకలాపాలు ప్రాంతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

పోలీసు విధులు, పరికరాలపై విద్యార్థులకు అవగాహన.. ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు





మెదక్, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్ ప్రతినిధి):

పోలీసు శాఖ విధులు, నేరాల నియంత్రణకు వినియోగించే పరికరాలు, ప్రజల భద్రత కోసం అందించే సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మెదక్ జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాలను విద్యార్థులకు ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. బాంబు డిస్పోజల్ (బీడీ) బృందం ఉపయోగించే పరికరాలు, అనుమానాస్పద పేలుడు పదార్థాలను గుర్తించడం, ప్రమాదాలను నివారించడంలో వాటి పాత్ర గురించి అధికారులు వివరించారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వాటిని తాకకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం డాగ్ స్క్వాడ్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేర పరిశోధనలో నిందితుల ఆచూకీ గుర్తించడం, పేలుడు పదార్థాలను కనిపెట్టడం వంటి విధుల్లో శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు అందించే సేవలను సిబ్బంది ప్రత్యక్షంగా వివరించారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాల పనితీరు, ప్రజల రక్షణలో పోలీసులు నిర్వహించే బాధ్యతలను విద్యార్థులు తెలుసుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ద్వారా పోలీసు సహాయం, అగ్నిమాపక సేవలు, వైద్య అత్యవసర సేవలను ఎలా పొందవచ్చో వివరించారు. ఆపద సమయంలో ఆలస్యం చేయకుండా 112కు ఫోన్ చేసి సహాయం కోరాలని సూచించారు. చిన్నారుల రక్షణకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు శాఖ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమం విద్యార్థుల్లో పోలీసుల విధులు, భద్రతా చర్యలు, చట్టాలపై అవగాహన పెంపొందించడానికి దోహదపడింది.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం చాగదు - వాస్తవం ఆగదు
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

తడ్తాన్‌పల్లి ఎక్స్‌రోడ్డులో ఘనంగా దసరా అలాయ్ బలాయ్.. పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



సందేశం టైమ్స్:

దసరా పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని తడ్తాన్‌పల్లి ఎక్స్‌రోడ్డులో ఉన్న ఎం.ఎస్. ఫంక్షన్ హాల్‌లో అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సోదరభావం, సామాజిక ఐక్యతను చాటిచెప్పే అలాయ్ బలాయ్ కార్యక్రమంలో నాయకులు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో వట్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వజనాల విశ్వాస్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ పటేల్, వట్‌పల్లి మండల మాజీ అధ్యక్షుడు రమేష్ జోషి, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, కేరూర్ సర్పంచ్ కార్తీక్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు శివచరణ్, రమేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్ రావు పాటిల్, నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఖాజా, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి పాటిల్, నారాయణ గౌడ్, యువజన ఎస్సీ సెల్ నాయకుడు రవీందర్ కళ్యాణ్‌తో పాటు పలువురు మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌నినో పేరుతో మిల్లర్ల దోపిడీ..

- ఇష్టారాజ్యంగా బియ్యం ధరల పెంపు.
- నెల రోజుల్లో రెట్టింపైన బీపీటీ రేటు
- బీపీటీ క్వింటాల్ ధర రూ.4,500 నుంచి రూ.9,000కు పెంపు
- హెచ్ఎంటీ, జైశ్రీరాం బియ్యం ధరలకూ రెక్కలు
- పాత నిల్వలతో భారీ లాభాలు
- ఆందోళనలో సామాన్యులు

సందేశం టైమ్స్:

ఎల్‌నినో ప్రభావం ఉంటుందనే ప్రచారాన్ని ఆసరాగా చేసుకుని ఉమ్మడి జిల్లాలో బియ్యం ధరలు భారీగా పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బీపీటీ సన్న బియ్యం ధరను మిల్లర్లు నెల రోజుల్లోనే రెట్టింపు చేయడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో క్వింటాల్‌కు రూ.4,500గా ఉన్న బీపీటీ బియ్యం ధర ప్రస్తుతం రూ.9,000కు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. హెచ్ఎంటీ, జైశ్రీరాం రకాల బియ్యం ధరలు సైతం భారీగా పెరిగినట్లు తెలుస్తోంది.పాత నిల్వలతో భారీ లాభాలు? ఉమ్మడి జిల్లాలో సుమారు 456 రైస్ మిల్లులు ఉండగా, వాటిలో ఉన్న బియ్యం నిల్వలతో దాదాపు ఏడాదిన్నర పాటు వ్యాపారం చేయవచ్చని వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యే వరకు, సెప్టెంబర్ మొదటి వారం నాటికి బీపీటీ బియ్యం క్వింటాల్ ధర రూ.4,500గా, హెచ్ఎంటీ రూ.6,500గా, జైశ్రీరాం రూ.7,500గా ఉన్నట్లు సమాచారం.అయితే, వరి కోతలు ప్రారంభం కావడంతో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మిల్లర్లు పచ్చి వడ్లను క్వింటాల్‌కు రూ.3,800 చొప్పున కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బియ్యం ధరలు పెరిగే అవకాశాలున్నాయనే ప్రచారం మొదలైంది. ఇదే అదనుగా భావించి ఉమ్మడి జిల్లా మిల్లర్లు ధరలను పెంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రోజురోజుకూ పెరుగుతున్న ధరలు గతంలో తక్కువ ధరలకు కొనుగోలు చేసి నిల్వ ఉంచిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, ఇప్పుడు పెరిగిన ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ధాన్యం మార్కెట్‌లోకి వస్తున్న సమయంలో బియ్యం ధరలు తగ్గాల్సిందిపోయి పెరుగుతుండటంపై వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బీపీటీ బియ్యం ధర నెల రోజుల్లోనే క్వింటాల్‌కు రూ.4,500 నుంచి రూ.9,000కు చేరడంతో ధరల పెంపు వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హెచ్ఎంటీ, జైశ్రీరాం బియ్యం ధరలు కూడా పెరుగుతుండటంతో మధ్యతరగతి, పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న



ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది.అధికారుల పర్యవేక్షణ ఏదీ? బియ్యం ధరలు ఏ రోజుకారోజు పెరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో మార్కెట్‌లో ధరల నియంత్రణ, నిల్వల వివరాలు, ధరల పెంపునకు గల కారణాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మిల్లుల్లో ఉన్న నిల్వలు, కొనుగోలు ధరలు, విక్రయ ధరలపై పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలని వినియోగదారులు కోరుతున్నారు.రానున్న రోజుల్లో బియ్యం ధరలు మరింత పెరుగుతాయనే ప్రచారం సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావం పేరుతో ధరలు పెరుగుతున్నాయా? లేక మార్కెట్ పరిస్థితులను ఆసరాగా చేసుకుని ధరలు పెంచుతున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయ భూ వివాదం.. వ్యక్తి మృతి..

తొమ్మిది మందిపై కేసు నమోదు

సందేశం టైమ్స్:



ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో వ్యవసాయ భూమి వివాదం నేపథ్యంలో కన్నెబోయిన కొండలు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు చింతకాని ఎస్ఐ జి. నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన కన్నెబోయిన నాగేంద్రమ్మ తన భర్త కన్నెబోయిన కొండలుతో కలిసి వ్యవసాయ భూమి విషయంలో కొంతకాలంగా వివాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 21న తన కుమారుడు కన్నెబోయిన ఉపేందర్‌పై, అనంతరం తన భర్త కన్నెబోయిన కొండలుపై కొందరు దాడికి ప్రయత్నించి, చంపుతామని బెదిరించినట్లు నాగేంద్రమ్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పరిణామాలతో మనస్తాపానికి గురైన కన్నెబోయిన కొండలు గడ్డిమందు తాగగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్టోబర్ 22న మధ్యాహ్నం 3.19 గంటలకు మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై అక్టోబర్ 23న ఉదయం 10 గంటల సమయంలో నాగేంద్రమ్మ చింతకాని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఆమె ఫిర్యాదు ఆధారంగా కన్నెబోయిన అంజయ్య, కన్నెబోయిన నాగేంద్ర, కన్నెబోయిన నాగేశ్వరరావు, కన్నెబోయిన రామారావు, కన్నెబోయిన సాయి, కన్నెబోయిన శ్రీను, శీలం చైతన్య, కన్నెబోయిన సీతారామయ్య, చౌడం సత్యం అనే తొమ్మిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్ఐ జి. నరేష్ వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

87 వేల ఆర్థిక సాయంతో వెలుగులు నింపిన ఫ్రెండ్స్ గ్రూప్

- ఆపదలో అండగా నిలిచిన ఫ్రెండ్స్ గ్రూప్...!
- రూ.87 వేల ఆర్థిక సాయంతో వెలుగులు నింపిన 'ఫ్రెండ్స్ గ్రూప్'!
- ఇది 14వ సాయం...ఆగని వీరి సేవా ప్రస్థానం.

సందేశం టైమ్స్:

జగదేవపూర్ : అప్పుల ఊబిలో కూరుకుపోయి, కష్టాలు తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడిన ఓ యువ రైతు ఉదంతం పలుగు గడ్డ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కొన్ని రోజుల క్రితం పలుగు గడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో ఆ యువ రైతు చెట్టుకు ఉరివేసుకుని తనువు చాలించాడు. ఆయన మరణంతో ఆ నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబానికి ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.ఆ కుటుంబం పడుతున్న ఆవేదనను చూసిన 'ఫ్రెండ్స్ గ్రూప్' సభ్యులందరూ చలించిపోయారు. కేవలం సానుభూతి చూపి ఊరుకోకుండా, ఆ నిస్సహాయ కుటుంబానికి చేతనైన సహాయం చేయాలని సంకల్పించారు.ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షులు నర్ర నర్సింలు లింగాల గణేష్‌ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులందరూ కలిసి ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ, తమ వంతుగా పెద్ద మనసుతో ?87,000 (ఎనభై ఏడు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేసి, మేమున్నామంటూ ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షులు నర్సింలు,గణేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న స్నేహితుడి/రైతు కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో గ్రూప్ సభ్యులమంతా కలిసి ఈ మొత్తాన్ని సేకరించినట్లు తెలిపారు. అన్నం పెట్టే రైతు కుటుంబాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రోడ్డున పడకూడదని, తమ వంతు చిన్న సహాయంగా దీనిని అందజేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా స్పందించి ఈ బాధితుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి తమ గ్రూప్ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఇది 14వ సాయం.. ఆగని వీరి సేవా ప్రస్థానం ఈ స్నేహితుల బృందం కేవలం ఈ ఒక్క



కుటుంబానికే కాదు, గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు వీరు సాయం అందించడం ఇది 14వ సారి కావడం విశేషం. తాము సంపాదించే సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవ కోసం కేటాయిస్తూ, నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తూ ఊరికే ఆదర్శంగా నిలుస్తున్నారు,ఈ కార్యక్రమంలో మాందాపూర్ గ్రామ సర్పంచ్ మౌనిక ముత్యం,పలుగు గడ్డ మాజీ సర్పంచ్ రాజేశ్వరి రవి,ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు కృష్ణ, అంజయ్య,యువరాజు, లింగాల నరేష్,కనకయ్య, రమేష్,నరేష్,అజయ్,లింగాల రమేష్, శశిధర్,చెక్కల రమేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల పోలీస్ స్టేషన్ లో స్కూల్ విద్యార్థులతో ఓపెన్ హౌస్ ప్రోగ్రాం

సందేశం టైమ్స్:



చేర్యాల పోలీస్ స్టేషన్ లో బుధవారం స్కూల్ విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీసుల విధుల గురించి, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు వచ్చినప్పటి నుండి ఎలాంటి ప్రక్రియ జరుగుతుందో అధికారులు వివరించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు. విద్యార్థులకు పోలీస్ వ్యవస్థ పనితీరుపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పోలీసులు తెలిపారు.

సైబర్ నేరాలు, మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

-సంతాయిపేట్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్:

కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం సంతాయిపేట్ గ్రామంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యెల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఎస్ నగర్ సర్కిల్ సీఐ వీరయ్య, తాడ్వాయి ఎస్ఐ వై. నరేష్, పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 100 మంది గ్రామస్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని, ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు, సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత సేవలను వినియోగించుకోవాలని వివరించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, బాలలను పనిలో పెట్టకుండా వారి విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు



పోలీసుల సూచనలను పాటిస్తూ సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రైడ్
సందేశం టైమ్స్
నిజం చాగదు - వార్త ఆగదు

బిక్కనూర్ లో స్వీట్ షాపులపై స్పెషల్ డ్రైవ్ తనిఖీలు..

-గడువు తీరిన ఆహార పదార్థాల గుర్తింపు..

-అక్కడికక్కడే ధ్వంసం అపరిశుభ్రత ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ



సందేశం టైమ్స్:

కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా భిక్నూర్‌లోని పలు స్వీట్ షాపుల్లో అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో గడువు తీరిన ఆహార పదార్థాలను గుర్తించి, వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.అలాగే అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, విశ్లేషణ కోసం ప్రయోగశాలకు పంపించారు.ఆహార పదార్థాల తయారీదారులు, దుకాణ నిర్వాహకులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అధికారులు సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని స్పష్టం చేశారు.ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

ఎస్బీఐ అధికారుల నిర్లక్ష్యం.. నిలిచిపోయిన పంచాయతీ ఎకౌంట్లు!

- ములకలపల్లి ఎస్బీఐలో స్కానర్ నెపంతో సర్పంచులకు తిప్పలు -
- ప్రజాప్రతినిధులకే దిక్కులేని పరిస్థితి
- ములకలపల్లి ఎస్బీఐ తీరుపై సర్పంచులు,ప్రజల ఆగ్రహం
- వృద్ధులు,విద్యార్థులకు నరకం
- 16వ ఆర్థిక నిధుల ఎకౌంట్లకు బ్రేక్.. ఎస్బీఐ మేనేజర్ నిర్వాకంపై మండిపడుతున్న ప్రజాప్రతినిధులు
- ఎస్బీఐ బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పంచాయతీ ఎకౌంట్లు ప్రజాప్రతినిధులకే దిక్కులేదు





సందేశం టైమ్స్:

ములకలపల్లి:ములకలపల్లి మండల కేంద్రంలో ప్రజలకు ప్రధాన బ్యాంక్ అయిన ఎస్బీఐ బ్యాంక్ లో అధికారుల నిర్లక్ష్యం,నిర్వాకం తారాస్థాయికి చేరింది.పంచాయతీ ఎకౌంట్లు ఓపెన్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తూ,సర్పంచులను సైతం లెక్కచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అసలు విషయం ఏంటంటే..

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 16వ ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్బీఐలో ఖాతా ఓపెన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలంలోని ప్రతి పంచాయతీ నుండి సర్పంచ్,ఉప సర్పంచ్, కార్యదర్శులు బ్యాంకు బ్రాంచ్ కి వెళ్లి ఎకౌంట్ ఓపెనింగ్ కోసం తిరుగుతున్నారు.కానీ గత రెండు నెలలుగా,గత వారం రోజులుగా బ్యాంకులో స్కానర్ లేదు అనే సాకుతో ఎకౌంట్లు ఓపెన్ చేయకుండా దాటవేస్తున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రెడ్ లైన్ దగ్గర పడుతున్నా,కాగితాలు తీసుకోకుండా,మేనేజర్, బ్యాంక్ సిబ్బంది సర్పంచులను మీరే ఎకౌంటు ఓపెనింగ్ ఫారాలను ఇంటికి తీసుకెళ్లమని చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.అడిగితే స్కానర్ లేదని దాటేస్తున్నారు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకే బ్యాంకులో ఇలాంటి పరిస్థితి ఉంటే,ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని మండిపడుతున్నారు.

సామాన్యులకు నరకం..

వృద్ధాప్య పింఛన్లు తీసుకోవడానికి వచ్చిన వృద్ధులను పట్టించుకోవడం లేదు.స్కాలర్ షిప్ ల కోసం ఎకౌంట్ ఓపెనింగ్ కు వచ్చిన విద్యార్థులను స్కానర్ లేదు,రేపు రండి అంటూ బయటకు పంపుతున్నారు.ఏదైనా ఆన్లైన్ లావాదేవీల గురించి అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని,రకరకాల కాగితాలు తెమ్మని వేధిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.బ్యాంక్ మేనేజర్ దారి,సిబ్బంది దారి వేరన్నట్టుగా వ్యవహరిస్తున్నారని,కస్టమర్లను లెక్కచేయడం లేదని మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.16వ ఆర్థిక నిధుల ఎకౌంట్ ఓపెనింగ్ గడువు ముగుస్తున్నా,ఎస్బీఐ అధికారులు స్పందించకపోవడంపై ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని సర్పంచులు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి..

-రైతులకు సూచించిన జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి



సందేశం టైమ్స్:

ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి రైతులకు సూచించారు.భిక్కనూరు మండలం రాగట్లపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె కూరగాయల సాగు పొలాలను సందర్శించి, పంటల స్థితిగతులను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కూరగాయల పంటలకు అవసరమైన నీరు అందుబాటులో ఉందా, పంటల పరిస్థితి ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు.ప్రస్తుతం పంటలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని, కూరగాయల పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆమెకు వివరించారు.ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి రైతులు పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ, నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే రాజీనామా చేయాలని

- ఓటు పై వేటు నిరసనపై నిషేధం ఎత్తివేయాలని



సందేశం టైమ్స్:

బూర్గంపాడు మండలంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సారపాక సుందరయ్య నగర్ లో అక్టోబర్ శుక్రవారం 23న నిరసన ప్లే కార్డులు పట్టుకొని ప్రదర్శన ర్యాలీగా నినాదాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఉన్న ఓటు హక్కుని తొలగించాలని ఆలోచనతో జ్ఞానేశ్ కుమార్ ని పాములాగా ఉపయోగించు కున్నదని అందువల్ల ఈ దేశంలో 13 కోట్లు ఓట్లు రద్దయ్యే పరిస్థితి కనపడుతుందని అందుకోసం జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే రాజీనామా చేయాలి అతనిపైన క్రిమినల్ కేసులు పెట్టాలని కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారుల్లో ఉన్నంతకాలం సామాన్య ప్రజలు బతికే పరిస్థితి లేదని ఓటు హక్కు కూడా రద్దు చేయాలని అనేక కుట్రలతో మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రయత్నం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి సరైన గుణపాఠం ప్రజలు చెబుతున్నారని ఇవాళ ఢిల్లీ జంతర్ బందర్ నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా కాలరాస్తున్న మోడీ ప్రభుత్వానికి విద్యార్థి సంఘాలు గుణపాఠం చెప్తున్నారని ఇవాళ దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ఆందోళన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మహిళ సంఘం జిల్లా నాయకురాలు పాపినేని సరోజన, కెవిపిఎస్ మండల కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు కనకం వెంకటేష్, బత్తుల గోపాలరావు, యార్లెంకి అప్పారావు, ఎస్ కె జాన్మియా, నిమ్మల పద్మ, బెల్లంకొండ పద్మ, నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలి..

-రెండో విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



సందేశం టైమ్స్:

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా కొత్తగా ఇళ్లు మంజూరైన అటికెల భూమయ్య, గణేష్‌లకు కలెక్టర్ మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పీఆర్ సురేష్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్‌కో సుధాకర్, ఏపీఓ ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉపసర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చింపి వేసిండ్రు అని ఎస్ఐకి ఫిర్యాదు

సందేశం టైమ్స్:

పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలం కిలవనపర్తి గ్రామం లో దసరా పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీ ని చింపినారని స్థానిక ఎస్సై ఎంబడి. శ్రీకాంత్ కు ఫిర్యాదు చేసినట్లు ధర్మారం మండల ఎంఆర్పిఎస్ జనరల్ సెక్రెటరీ, కిలవనపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొత్తూరు. మహేందర్ తెలిపారు ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నా ఎదుగుదలను చూసి ఓర్వలేక సొంత పార్టీ వారు అయినా కానీ, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు ఐనా కానీ చింపివేసి ఉంటారని తెలిపారు వారిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం చాటడం - వార్త ఆగడం
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

నందిగామ జైహింద్ హాస్పిటల్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారు మేజర్ డాక్టర్ యశ్వంత్

సందేశం టైమ్స్:

నందిగామ జైహింద్ హాస్పిటల్‌పై అసత్య ప్రచారం చేస్తున్నా వారి పై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం జైహింద్ హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ సి సి టీవీ వీడియో రికార్డులను బయటపెట్టిన యాజమాన్యం లీగల్ నోటీసులకు వివరణ ఇవ్వకుంటే చట్టపరంగా ముందుకు వెళతాం యాజమాన్యం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఆస్పత్రి నిర్వాహకులు సీసీటీవీ దృశ్యాలు విడుదల చట్టపరమైన చర్యలకు సిద్ధం డాక్టర్ యశ్వంత్ నందిగామ జైహింద్ హాస్పిటల్‌పై గత రెండు రోజులుగా అసత్య ప్రచారం జరుగుతోందని ఆస్పత్రి నిర్వాహకులు ఆరోపించారు ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేజర్ డాక్టర్ యశ్వంత్ హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు తమపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సీసీటీవీ దృశ్యాలు ఇతర ఆధారాలను సంబంధిత అధికారులకు అందించినట్లు తెలిపారు ఈ వ్యవహారంపై చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు అసలు ఏం జరిగింది ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో చేతికి గాయంతో ఆస్పత్రికి వచ్చారని డాక్టర్ యశ్వంత్ తెలిపారు మొదట క్యాజువాలిటీలోకి తీసుకెళ్లి గాయానికి డ్రెస్సింగ్ చేశామని రక్త నమూనాలు సేకరించామని చెప్పారు. అనంతరం సర్జన్ పరీక్షించి నాలుగు కుట్లు వేయాల్సి ఉంటుందని సూచించినట్లు వివరించారు అప్పటివరకు రోగి నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని నాలుగు కుట్లు వేయడానికి రూ.2,000 ఖర్చవుతుందని ముందుగానే వివరించామని తెలిపారు ఈ క్రమంలో సదరు వ్యక్తి తాను ప్రభ న్యూస్ రిపోర్టర్‌నని చెబుతూ తననే డబ్బులు అడుగుతారా అంటూ వాగ్వాదానికి దిగారని ఆరోపించారు బయట చికిత్సకు ఎక్కువ ఖర్చవుతుందని తమ ఆస్పత్రిలో సహేతుకమైన ధరలకే వైద్యం అందిస్తున్నామని వివరించినట్లు చెప్పారు ఈలోగా సదరు వ్యక్తి పక్కకు వెళ్లి అప్పటికే వేసిన డ్రెస్సింగ్‌ను తొలగించి వీడియో చిత్రీకరణ ప్రారంభించారని డాక్టర్ ఆరోపించారు ఆస్పత్రిలోని మహిళా సిబ్బందిని బెదిరిస్తూ దుర్భాషలాడారని పేర్కొన్నారు ఆస్పత్రికి వస్తే డబ్బులు తీసుకోకుండా వైద్యం చేయరా అంటూ వివాదానికి దిగారని తెలిపారు ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ఆస్పత్రిలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయని వాటిని విలేకరుల సమావేశంలో ప్రదర్శించినట్లు వెల్లడించారు రోగికి చికిత్స అందించాం డాక్టర్ యశ్వంత్ సంఘటన సమయంలో తాను అక్కడికి చేరుకున్న తర్వాత రోగిని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి కుట్లు వేసినట్లు డాక్టర్ యశ్వంత్ తెలిపారు నాలుగు రోజుల తర్వాత పరిస్థితిని చూసి ఏడు రోజుల తర్వాత కుట్లు తొలగించేందుకు రావాలని రోగికి వివరంగా తెలిపామని అన్నారు రెండు రోజుల తర్వాత బెదిరింపులు సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత కొన్ని ఫొటోలు వీడియోలను ఆస్పత్రి వాట్సాప్ నంబర్‌కు పంపించి ఈ వ్యవహారంపై మాట్లాడాలని ప్రభ న్యూస్ రిపోర్టర్ ఖాసీం కోరినట్లు హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ తెలిపారు ఆస్పత్రిలో చికిత్సకు రూ.2,000 బిల్లు అవుతుందని ప్రస్తావిస్తూ ఖాసీం తమను సంప్రదించినట్లు పేర్కొన్నారు దీనికి స్పందిస్తూ తమ ఆస్పత్రిలో చికిత్స ఖర్చులు సహేతుకంగానే ఉంటాయని వివరించినట్లు అనిల్ తెలిపారు అయితే తాను మీడియా వ్యక్తినని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తానని ఆస్పత్రిలో నిబంధనలు పాటించడం లేదని ఖాసీం బెదిరించినట్లు అనిల్ ఆరోపించారు ఈ



వ్యవహారంపై చట్టపరంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు మహిళా సిబ్బందిని బెదిరించారని ఆరోపణ ఆస్పత్రి రిసెప్షన్‌లో పనిచేసే మహిళా సిబ్బందిని దుర్భాషలాడుతూ బెదిరించడంతో ఆమె భయాందోళనకు గురై గత మూడు రోజులుగా విధులకు హాజరు కావడం లేదని మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ తెలిపారు సదరు వ్యక్తిపై మహిళా సిబ్బంది కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ యశ్వంత్ పేర్కొన్నారు అధికారులకు ఆధారాలు అందించాం ప్రభ న్యూస్ రిపోర్టర్ ఖాసీం తమపై చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేశామని డాక్టర్ యశ్వంత్ తెలిపారు ఇందుకు సంబంధించిన పత్రాలు వీడియోలు ఇతర ఆధారాలను అధికారులకు సమర్పించినట్లు వెల్లడించారు చట్టపరమైన చర్యలకు సిద్ధం తమ ఆస్పత్రిపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా వ్యవహరించారని వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని ఆరోపిస్తూ ప్రభ న్యూస్ రిపోర్టర్ ఖాసీంపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని డాక్టర్ యశ్వంత్ తెలిపారు ఈ మేరకు లీగల్ నోటీసులు పంపిస్తున్నామని ఈ విషయాన్ని వైద్యుల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్తామని స్పష్టం చేశారు

వన మహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి..

-మొక్కలకు నీరు పోసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సందేశం టైమ్స్:



వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలకు నీరు పోశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అది ఆరోగ్యంగా పెరిగేలా చూడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పీఆర్ సురేష్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్‌కో సుధాకర్, ఏపీఓ ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం జోరు 23వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా కాసర్ల నాగమణి ఉ మున్సిపల్

- చైర్ పర్సన్ అభ్యర్థి వంశీధర్ ఆధ్వర్యంలో హోరెత్తిన ర్యాలీ

సందేశం టైమ్స్:

నందిగామ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 23వ వార్డులో టీడీపీ ప్రచారం జోరుగా సాగుతోంది మూడో రోజుకు చేరుకున్న ప్రచారంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొనడంతో వార్డులో పండగ వాతావరణం నెలకొంది 23వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా కాసర్ల నాగమణి (వైఫ్ ఆఫ్ కాసర్ల లక్ష్మీనారాయణ) ను పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్ ఆధ్వర్యంలో ప్రచారం హోరెత్తుతోంది ప్రతి గడప ప్రతి వీధి తిరుగుతూ ఓటర్లను కలుసుకుంటూ తమ యొక్క పార్టీ పాంప్లెట్ ను అందజేసి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్ మాట్లాడుతూ 23వ వార్డు టీడీపీ అభ్యర్థి కాసర్ల నాగమణి మంచి మనసున్న వ్యక్తి కలుపుగోలు వ్యక్తిత్వం కలిగిన మహిళ నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడే వ్యక్తి మన గుర్తు సైకిల్ గుర్తు చైర్ పర్సన్ గా నేను కౌన్సిలర్ గా కాసర్ల నాగమణి పోటీ చేస్తున్నాం మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి అని 23వ వార్డు ప్రజలను కోరారు మీ అమూల్యమైన ఓటు వేసి మమ్మల్ని గెలిపించండి మేమేంటో చూపిస్తాం అభివృద్ధి చేసి శాఖమూరి వంశీధర్ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నందిగామలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తు రాబోయే



రోజుల్లో వార్డులో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి నందిగామను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు మహిళలు స్థానిక ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు

నారాయణపురంలో ఘనంగా ఉచిత హెల్త్ క్యాంప్



సందేశం టైమ్స్:

రాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రాయ్య , ఉప సర్పంచ్ ఆకుల శ్రీను , కార్యదర్శి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఈ క్యాంపును నిర్వహించారు. సర్పంచ్ , ఉప సర్పంచ్. సెక్రటరీ.స్వయంగా పరీక్షలు చేయించుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో షుగర్, బిపి, గుండె సంబంధిత, టిబి, ఎక్స్-రే, స్కానింగ్ పరీక్షలు నిర్వహించి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు, పాలకవర్గ సభ్యులు - 7వ వార్డు సభ్యులు ఎడ్లపల్లి రమేష్ - 4వ వార్డు సభ్యులు మడకం ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ఈ యొక్క హెల్త్ క్యాంప్ గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరూ వచ్చి ఈ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని, నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు నెమలిపేట, పెంచికలపాడు, జగన్నాధపురం, సూర్యంపేట గ్రామస్తులందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరడం జరిగింది.ఈ హెల్త్ క్యాంప్ రేపు కూడా కొనసాగుతుందని తెలియజేశారు.

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

- ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి: ప్రజా సంఘాల నాయకులు

సందేశం టైమ్స్:



ఎన్నికల సంఘాన్ని స్వతంత్రంగా నిర్వహించకుండా ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐకేఎస్, టీయూసీఐ నాయకులు పిట్టల అర్జున్, దొడ్డ లక్ష్మీనారాయణ, పండూరి వీరబాబు డిమాండ్ చేశారు.జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దమ్మపేట సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారం-6లో అనేక మార్పులు చేసి కోట్లాది ఓట్లను తొలగించే విధంగా చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనని విమర్శించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల హక్కులను హరించే చర్యలకు పాల్పడుతున్నారని, మతం ఆధారంగా ఓట్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించడంతో పాటు ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, ఎన్నికల సంఘాన్ని సమూలంగా సంస్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, కొప్పుల శ్రీను, కౌలూరి రామకృష్ణ, బాబురావు, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చందాపురం ఎంపీటీసీ అభ్యర్థిగా కొంగర నరేంద్ర నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు

సందేశం టైమ్స్:



నందిగామ మండలం కేతవీరునిపాడు పంచాయతీ పరిధి చందాపురం సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిగా శ్రీ కొంగర నరేంద్ర నామినేషన్ దాఖలు చేశారు ఎంపీడీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమశీలో కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ శ్రీ నెలకుదిటి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థికి సంఘీభావం తెలిపారు వారితో పాటు స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆశీస్సులతో చందాపురం కేతవీరునిపాడు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
సందేశం టైమ్స్
నిజం దాగదు - వార తగదు
Published by తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

43వ వార్డు గ్రాడ్యుయేట్ ఓటర్ల అర్హులైన వారందరూ ఓటు నమోదు చేసుకోండి

శ్రీమతి బత్తుల ఝాన్సీ లక్ష్మి రమేష్ 43వ వార్డ్ కౌన్సిలర్

సందేశం టైమ్స్:



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రారంభం అయింది చివరి తేది నవంబర్ 6 వరకు ఉంది43 వార్డు పరిధిలోని అర్హులైన గ్రాడ్యుయేట్ సోదర సోదరీమణులందరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని 43వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి బత్తుల ఝాన్సీ లక్ష్మీ రమేష్ కోరారు. ఓటు నమోదు చేసుకోనట్లయితే, వెంటనే ఈరోజే నమోదు చేసుకోండి అని తెలిపారు.(గతం లో ఉన్న మీజ ఓట్లు చెల్లవ్, ప్రతి ఒకరు నూతన మీజ ఓట్లు అప్లై చేస్కవాల్సదే)ఓటరు నమోదు కోసం అవసరమైన పత్రాలు:

1. పాస్‌పోర్ట్ సైజు ఫోటో 2. డిగ్రీ మెమో జిరాక్స్ 3. ఆధార్ కార్డు జిరాక్స్ 4. లోకల్ ఓటర్ ఐడీ జిరాక్స్ 5. మొబైల్ నంబర్ మీరు చేయాల్సిందల్లా పైన పేర్కొన్న పత్రాలను తీస్కొని రండి మేముఅందుబాటులో ఉన్న ఇంటర్ నెట్ షాప్ లో లేదా మా బిఆర్ఎస్ పార్టీ వారికి తగిన పత్రాలు ఇవండీ. మీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియలో మా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మీకు సహకరిస్తరు లేదా ఈ లింక్ ఓపెన్ చేసి మీ మొబైల్ లో అప్లై చేయండి

– ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ :
https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx

మీ ఓటు మీ హక్కు -- ప్రజాస్వామ్యంలో మీ భాగస్వామ్యం అర్హులైన ప్రతి డిగ్రీ, డిప్లొమా చదివి 2023 (పాస్)ఇయర్ వరకు కంప్లీట్ అయినా వారు అందరూ గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకునేలా మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఈ సమాచారాన్ని తెలియచేయండి అని అన్నారు.

ఉన్నత విద్యతో సమాజంలో ఉన్నత స్థానం సాధించాలి

– జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం

సందేశం టైమ్స్:

ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో ఉన్నత స్థానం సాధించడంతో పాటు తమ ప్రతిభతో సమాజానికి సేవలందించాలని పలువురు ప్రముఖులు విద్యార్థులకు సూచించారు. జమాతే ఇస్లామీ హింద్ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్, పర్కిట్ ప్రాంతాలకు చెందిన ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందిన ముగ్గురు విద్యార్థులతో పాటు, ఎల్ఎల్బీ పూర్తి చేసిన విద్యార్థినిని ఆర్మూర్‌లోని జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ డేర్ అధ్యక్షుడు, వైద్యాధికారి డాక్టర్ అహ్సానుల్లా మాట్లాడుతూ, ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యా రంగాల్లో మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య, న్యాయ, విద్యా రంగాలు నేటి సమాజంలో ఎంతో ప్రాధాన్యత కలిగినవని పేర్కొన్నారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం విజయానికి తొలి మెట్టు మాత్రమేనని, తదుపరి దశల్లో కఠోర శ్రమతో పాటు పాఠ్యాంశాలను లోతుగా అధ్యయనం చేయడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందన్నారు.జమాతే ఇస్లామీ హింద్ ఆర్మూర్ శాఖ స్థానిక అధ్యక్షుడు అస్లం బిన్ మొహసిన్ ప్రారంభోపన్యాసం చేస్తూ, ముస్లిం విద్యార్థులను ఉన్నత విద్యా రంగాల్లో ప్రోత్సహించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించడం ద్వారా ఇతర విద్యార్థుల్లోనూ స్ఫూర్తి నింపడం, వారు సైతం ఉన్నత విద్యను అభ్యసించి వివిధ వృత్తిపరమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.ఆషా ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం కష్టపడి చదవడంతో పాటు వైద్యరంగంలో ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత స్థాయి వైద్య నిపుణులుగా ఎదగాలంటే నిరంతర అధ్యయనం, అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.మౌలానా కబీరుద్దీన్ మజాహిరి మాట్లాడుతూ, విద్యార్థులు ధార్మిక విద్యతో



పాటు ఆధునిక విద్యలోనూ రాణించి, ఆధ్యాత్మికంగా, సామాజికంగా ఉన్నత స్థానాన్ని సాధించాలని సూచించారు. విద్యతో వ్యక్తిగత అభివృద్ధి సాధించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందిన ముఫ్తాహుద్దీన్ హమ్మాద్ తండ్రి వహాజుద్దీన్ మాజిద్, షేక్ రేహానుద్దీన్ తండ్రి షేక్ ఆరిఫుద్దీన్), షేక్ అబూజర్ తండ్రి షేక్ రఫీ ఎల్ఎల్బీ పూర్తి చేసిన జువేరియా నఖత్ తండ్రి మౌలానా కబీరుద్దీన్ మజాహిరిలను ముఖ్య అతిథులు డాక్టర్ అహ్సానుల్లా, డాక్టర్ అబ్దుల్ అజీజ్, మౌలానా కబీరుద్దీన్ మజాహిరి తదితరులు మెమెంటోలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఖాలిద్ అధ్యక్షత వహించగా, వాజిద్ అతిథులు, పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

మల్లవరం బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను నెరవేర్చిన ఎంపీ రవిచంద్ర

సందేశం టైమ్స్:

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరంకు చెందిన 96 సంవత్సరాల బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నెరవేర్చారు.మల్లవరం గ్రామ సర్పంచ్ గా 2సార్లు, ఎంపీటీసీగా 2 పర్యాయాలు, సింగిల్ విండో డైరెక్టర్ గా పని చేసిన సామ్రాజ్యం అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలకు పాత్రులయ్యారు.అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అంటే సామ్రాజ్యంకు ఎనలేని అభిమానం.మహానేత కేసీఆర్ ను కలిసి ఫోటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక.ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురాగా,ఆయన సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా



సామ్రాజ్యంను ఆమె కుమారులు వెంకటలాల్,అజయ్ కుమార్,మనవళ్లు యుధిష్టర్,శ్రీరఘునందన్ లను వెంటబెట్టుకుని రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు వద్దకు తీసుకెళ్లారు.సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించి గౌరవించారు,త్వరలో కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేర్చుతానని మాటిచ్చారు.రఘునందన్ ను అభినందించిన కేటీఆర్ సామ్రాజ్యం మనవడు,అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు.ఆయనకు చిన్నతనం నుంచే సమాజ సేవ,పరిశుభ్రత,పచ్చదనం పట్ల మక్కువ ఎక్కువ.మహానేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 2016 ఫిబ్రవరి 17వతేదీన తమ స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన దత్తత తీసుకున్నారు.అప్పుడాయన 5వ తరగతి చదువుతున్నారు,వయస్సు 9 ఏళ్లు.తాను దత్తత తీసుకున్న ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాక పరిసరాలలో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచారు.చిన్నతనంలోనే శ్రీరఘునందన్ చేస్తున్న సమాజసేవను అభినందిస్తూ 2017లో జాతీయ,2017,18లలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి.ఈ సందర్భంగా శ్రీరఘునందన్,ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్రలు అభినందించారు.

గొల్ల గట్టు (పెద్దగట్టు) జాతరకు అధిక నిధులు కేటాయించాలి



– బీసీ విద్యార్థి సంఘం నేత లింగయ్య యాదవ్

సందేశం టైమ్స్:

తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద గొల్ల గట్టు (పెద్దగట్టు) అధిక నిధులు కేటాయించాలని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లింగమంతుల స్వామి గుట్ట ను సందర్శించి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతరకు అధిక నిధులు కేటాయించి గుట్టను అభివృద్ధి చేయాలి, అదేవిధంగా గుట్టకు సంబంధించిన భూములను ప్రభుత్వ అధికారులు సర్వే చేయించి హద్దులను గుర్తించాలి . శాశ్వత పాలకమండలని తక్షణమే ఏర్పాటు చేయాలి పర్మినెంట్ సౌకర్యాలను కల్పించాలి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం .గొల్ల గట్టు జాతర పట్ల అశ్రద్ధ వహిస్తే ముఖ్యమంత్రి ఇంటినీ లక్షలాది మందితో ముట్టడిస్తాం మని హెచ్చరించారు . కార్యక్రమంలో మాజీ గుట్ట డైరెక్టర్ మెంతబోయిన లింగస్వామి , బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పరాల సాయి, తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారబోయిన లోకేష్ యాదవ్, గురవయ్య, సందయ ,మున్న నాగయ్య తదితరులు పాల్గొన్నారు

ఆందోల్ లో ఘనంగా అలయ్-బలయ్ వేడుకలు

– ఆందోల్ నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు –

పి పి టి ద్వారా వివరించిన మంత్రి దామోదర్

– తెలంగాణ సంస్కృతికి ప్రతీక అలయ్-బలయ్ – చౌటకూర్ మండలం తాటిదాన్పల్లి చౌరస్తా లో నీ ఎం ఎస్ ఫంక్షన్ హాల్ లో వేలాది మంది కార్యకర్తలతో ఘనంగా వేడుకలు

– 3 వేల కోట్ల అభివృద్ధితో ఆందోల్ రూపురేఖలు మార్చాం

సందేశం టైమ్స్:

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారి ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గ స్థాయిలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు కొలమానంగా నిలిచే విజయదశమి పండుగ సందర్భంగా అలయ్-బలయ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. చౌటకూర్ మండలం తాడ్డాన్ పల్లి లోని ఎం.ఎస్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుండి నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాదిగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆందోల్ నియోజకవర్గంలో సుమారు 3 వేల కోట్ల పై చిలుకు రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యకర్తలకు వివరించారు. ముఖ్యంగా రోడ్లు, ఆసుపత్రుల నిర్మాణాలు, నర్సింగ్ కాలేజ్, హాస్టల్ భవనాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, కేజీబీవీ లు, సిఎస్ఆర్ నిధులతో విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు, కంప్యూటర్ ల్యాబ్ లు, బస్సులు, పాఠశాలల అభివృద్ధి, సంక్షేమ హాస్టళ్లలో వసతులు, ఆందోల్ లో స్టేడియం అభివృద్ధి, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన లా కాలేజీ, పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, జోగిపేట-ఆందోల్ పట్టణాలను అనుసంధానం చేస్తూ బ్రిడ్జిల నిర్మాణం, సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిసర ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, రవాణా, టూరిజం అభివృద్ధికి చేపట్టిన



పనులను వివరించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, సభ్యులు కిషన్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ శ్రీ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సురేందర్ గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్, దిగంబర రావు, శేషారెడ్డి, దుర్గారెడ్డి, గణేష్, కేదారనాథ్, ఆత్మ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, సేవాదళ్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొని మంత్రి దామోదర్ రాజనర్సింహ కి అలయ్-బలయ్ శుభాకాంక్షలు తెలియజేశారు.